క్లుప్తంగా

వడ్డుపల్లికి చేరిన పీఏబీఆర్ నీరు



కూడేరు దాటి వడ్డుపల్లి వైపు ప్రవహిస్తున్న పీఏబీఆర్ నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) నుంచి ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజక వర్గాలోని ప్రజల తాగు నీటి అవసరాల కోసం సోమవారం నుంచి ధర్మవరం కుడికాలువకు నీటిని విడుదల చేశారు. 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. గురువారం కుడికాలువ ద్వారా పీఏబీఆర్ నీరు కూడేరు దాటి రాప్తాడు నియోజక వర్గం ఆత్మకూరు మండలంలోని వడ్డుపల్లి వరకు చేరింది. తొలుత చివరన ఉన్న తాడిమర్రి మండలం అగ్రహారం చెరువు నుంచి నీటిని నింపుకుంటూ పీఏబీఆర్ డ్యాం మొదట్లో ఉన్న మరుట్ల చెరువును నింపుతామని హెచ్చెల్సీ అధికారులు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

రాయదుర్గంటౌన్: సమాజంలో లింగ వివక్షత, అసమానతలు, బాల్య వివాహాల నిర్మూలన ప్రతి పౌరుడి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లింగ వివక్షత, బాల్య వివాహాల నిర్మూలనపై కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రమేష్, ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరాయన్నారు. అనంతరం మురుగునీటి కాల్వల్లో, డ్రైనేజీ కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, స్ప్రే చేయించారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఎర్రమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

కంబదూరు: కంబదూరు ఎక్సైజ్ సీఐలు సుహాసిని, సునీల్, ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు పట్టుబడ్డారు. శెట్టూరు మండలం చిన్నంపల్లిలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 71 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. మూలనూరులో ఆంధ్ర మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓబులేసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని నుంచి 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యువరాజ్ గురువారం తెలిపారు. ఎక్కడైనా పేకాట, మద్యం విక్రయిస్తున్నా సెల్:9490106284 సమాచారం అందించాలని కోరారు.

కనులపండువగా రథోత్సవం



బేలోడులో రథంలో ఊరేగుతున్న స్వామి

గుమ్మఘట్ట: బేలోడు గ్రామంలో ఆంజనేయ స్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. స్వామి మూలవిరాట్‌ను రథంలో అధిష్టించి గ్రామంలో పుర వీధుల్లో ఊరేగించారు.

ఘనంగా కనకదాస జయంతి



కనకదాస చిత్రపటానికి పూజలు చేస్తున్న కురుబలు

కంబదూరు: మండలంలోని మేళ్లకుంట గ్రామంలో కురుబ కుల ఆరాధ్యదైవమైన భక్త కనక దాస జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు పెద్ద సంఖ్యలో జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి కనకదాసు చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యంత్రంతో వరి పంట కోస్తున్న దృశ్యం

వరి సాగు భారం

- వరి సాగుకు ఏటేటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు
- కోత యంత్రాలకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్
- ఆదుకోని కూటమి ప్రభుత్వం

రాయదుర్గం: ఏటేటా పెరుగుతున్న సాగు ఖర్చులతో రైతు 'వ్యయ'సాయం చేయాల్సి వస్తోంది. సాగు కష్టాలు తప్పడం లేదు. నారు పోసిన నాటి నుంచి వరి కోసి ధాన్యం అమ్మే వరకు నానా పాట్లు పడాల్సి వస్తోంది. పెట్టుబడి ఖర్చులు పెరిగి అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది వరి సాగుపై పెట్టుబడి భారం రెట్టింపైంది. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్లు, టిల్లర్లు, హార్వెస్టర్లు ఇతర యంత్ర పరికరాలు, కూలీల చార్జీల పెరిగి వ్యవసాయం పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. ఫలితంగా దళారులే ధర నిర్ణేతలయ్యారు. వారు చెప్పిందే ధర? ఇచ్చిందే మొత్తం అన్నట్టుగా మారింది. పంట పండించటం ఓ ఎత్తయితే.. దాన్ని అమ్ముకుని సొమ్ము చేకోవడం మరింత భారమవుతోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియెజక వర్గాల్లోని ఖరీఫ్ సీజన్‌లో హెచ్చెల్సీ ఆయకట్టుతో పాటు బోరు బావుల కింద బీపీటీ, ఎన్ఎల్ఆర్, ఆర్ఎన్ఆర్, 64 రకం, కావేరి సోనా రకంకు చెందిన వరి పంటను రైతులు 14,622 హెక్టార్లలో సాగుచేశారు. ప్రస్తుతం అన్నిచోట్లా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఆశాజనకంగా ఉన్న వరి పంట కోత దశలో కొన్ని చోట్ల నేలవాలింది. దీంతో వరికోతకు యంత్రాల అద్దె, కోతకు పట్టే అధిక సమయం పెనుభారంగా తయారైంది. నేల వాలిన కంకులలో గింజలు గట్టిపడక పోవడం ధాన్యం గింజలు నేలరాలడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గతేడాదితో పోలిస్తే ఈసారి ఎరువుల ధరలు, కూలీల రేట్లు పెరగడంతో పెట్టుబడి కష్టాలు రెట్టింపు అయ్యాయి.

కోతలకు పెరిగిన డిమాండ్

బొమ్మనహాళ్, కణేకల్లు, డి హీరేహాళ్ మండలాల్లో 80 శాతం మంది రైతులు ఎక్కువగా వరి సాగు చేయడంతో కోతలకు డిమాండ్ పెరిగింది. అనంతపురం, కర్నూలు, కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, కొప్పళ్ జిల్లాల్లోని వరి కోతలు ఒకేసారి ప్రారంభం అయ్యాయి. వరి అన్ని చోట్ల ఒకేసారి కోతదశకు రావడం, అకాలవర్షాలకు నేలవాలడంతో యాంత్రాలకు, కూలీలకు డిమాండ్ పెరిగింది. ఫెయింజల్ తుఫాను బలహీన పడడంతో ఒక్కసారిగా యంత్రాలకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో దళారులు ఇష్టారాజ్యంగా అద్దె పెంచడంతో అన్నదాతలకు పెనుభారమైంది. గత ఏడాది గంటలకు అద్దె రూ.2,900 చెల్లించామని ఈసారి యంత్రాలకు గంటకు రూ.3,000 నంచి రూ. 3,500 వరకు అద్దె ఉంది. ఎకరా విస్తీర్ణంలో వరి కోత కోసి కుప్ప వేయడానికి కూలీలకు రూ.8 వేల వరకు అవుతుంది. రోజు వారి కూలీ అయితే రూ. 500 వరకు ఉంది. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీరంగాపురం, లింగదహాళ్, ఉంతకల్లు, దేవగిరి, బండూరు, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, గోనేహాళ్, శింగానహళ్లి, కృష్ణాపురం, బ్రహ్మసముద్రం, గొనుస, ఉప్పరహాళ్, గంగలాపురం, కణేకల్లు ,తుంబిగనూరు, మాల్యం, ఉడేగోళం తదితర గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభం అయ్యాయి. గ్రాసానికి గిరాకీ ఉండటంతో చాలా మంది కూలీలతో కోతలు కోస్తుండగా, మరికొందరు యంత్రాలను వినియోగిస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం,ఉరవకొండ నియోజకవర్గాల్లో వరి సాగు విస్తీర్ణం ఇలా..

నియోజకవర్గం	వరి పంట విస్తీర్ణం (హెక్టార్లలో)
రాయదుర్గం	10,492
కళ్యాణదుర్గం	3,120
ఉరవకొండ	14,622
మొత్తం	14,622

కోత యంత్రాలు దొరకటం లేదు



వరి యంత్రాలకు డిమాండ్ బాగా పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తేకాని పొలంలోకి తీసుకెళ్లడం సాధ్యం కాదు. ఎక్కువ సాగు ఉన్నవారికే మొదటి అవకాశం కల్పిస్తున్నారు. ఎకరం, అర ఎకరం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– నాగభూషణ, రైతు, కణేకల్లు

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



వరి పంట మొత్తం కోతకొచ్చినా కొనుగోలు కేంద్రాల ఊసే లేదు. ఓ పక్క తుఫాన్లు, మరో పక్క దళారుల ప్రమేయం ఎక్కువై రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సత్వరం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలి.

– అంజిరెడ్డి, రైతు, నాగలాపురం, డి హీరేహాళ్

నేలకొరిగిన వరి పంట పరిశీలన



నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సాక్షి ఎఫెక్ట్..

బొమ్మనహాళ్: మండలంలోని హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలోని శ్రీరంగాపురం క్యాంపు, ఉద్దేహాళ్ గ్రామ శివారులోని నేలకొరిగిన వరి పంటను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈనెల 2న 'ధాన్యం..దైన్యం..మాటల్లోనే ధాన్యం', ఈనెల 4న 'చేతికొచ్చిన పంట నీటిపాలు' శీర్షికల కింద 'సాక్షి'లో కథనాలు ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.. అధికారులతో కలిసి పంటను పరిశీలించారు. హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో నేలకొరిగిన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక తయారు చేయాలని తహసీల్దార్ మునివేలును ఆదేశించారు.

ఉపాధ్యాయుడిపై విద్యార్థుల దాడి హేయం

కుందుర్పి: రాయచోటిలో ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు అజాద్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేసి చంపడం హేయమైన చర్య అని ఏపీ స్టేట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ అన్నారు. ఈఘటనను ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో ఖండించాలని సూచించారు. కుందుర్పిలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం వారు అజాద్ అహ్మద్‌పై దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బీసీ తిమ్మప్ప, బొమ్మయ్య, మంజునాథ్, ఈరప్ప, రామకృష్ణ, బసవరాజు మాయదార్లపల్లి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్కారుపై ప్రజా వ్యతిరేకత మొదలైంది

- రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే మెట్టు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు

డి హీరేహాళ్(రాయదుర్గం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజావ్యతిరేకత మూటకట్టుకుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆరోపించారు. గురువారం డి హీరేహాళ్ మండలంలోని మురడిలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీలు కాస్త గాలికొదిలేశారన్నారు. ప్రజలు నమ్మి ఓట్లేస్తే ఇంతలా మోసం చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉండి ఉంటే ఈ పాటికి రైతు భరోసా, అమ్మఒడి, ఆసరా, నేతన్న నేస్తం, ఫీజు రీయింబర్స్‌మెంట్, చేదోడు, చేయూత, తోడు, విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలు పేదల దరి చేరేవన్నారు. ఈ పథకాలు కాలగర్భంలో కలిపేశారని విమర్శించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. గడిచిన ఆరు నెలల కాలంలో ఊరూరా ఇసుక, మట్టి యథేచ్ఛగా తరలిపోతున్నా కట్టడి చేయలేకపోతున్నారన్నారు. బెల్టుషాపులు పెడితే బెల్టు తీస్తానని సీఎం చంద్రబాబు చెపుతున్నా ఊరూరా బెల్టు బార్లు వెలిశాయని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్త లపై ఇకపై దాడులు, అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటన చేయనున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గొడిశెలపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి, మురడి పద్మనాభరెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, బోర్‌వెల్ ఆనందరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాతీయ స్థాయి మెడల్స్ సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘురామూర్తి, అధ్యాపకులు

రాయదుర్గంటౌన్: ఉత్తరకాశీలో 15 రోజుల పాటు జరిగిన అడ్వాన్స్ ట్రెక్కింగ్ శిబిరంలో రాయదుర్గం కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. కళాశాలకు చెందిన గోపాల్, యోగేశ్వరి రన్నింగ్, అబ్స్టాకిల్ రన్నింగ్ పోటీల్లో గోపాల్ మొదటి బహుమతి, యోగేశ్వరి ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆర్.రఘురామమూర్తి తెలిపారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందించారు. ఎన్‌సీసీ టీవో జక్కల కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో 74 ఉడేగోళానికి చెందిన మల్లేష్, కొంతానపల్లికి మల్లికి తీవ్ర గాయలయ్యాయి. మరో యువకుడు మైలారు స్వల్ప గాయాలు బయటపడ్డాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని చాపిరి వద్ద ఆటో బోల్తాపడి డ్రైవర్ రవి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం కళ్యాణదుర్గానికి చెందిన రవి బాడుగ నిమిత్తం చాపిరి వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడింది. గాయపడిన డ్రైవర్‌ను స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

14న జాతీయ లోక్‌అదాలత్

రాయదుర్గంటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు రాయదుర్గం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీకి ఆమోదయోగ్యమైన అన్ని కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించబడుతాయన్నారు.

పశువుల బెడద నివారణకు చర్యలు

రాయదుర్గంటౌన్: పశువుల బెడద నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పశువుల యజమానులను పలుమార్లు హెచ్చరించినా స్పందించకపోవడంతో ఎట్టకేలకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం క్షేత్రస్థాయి చర్యలు చేపట్టారు. బళ్లారి రోడ్డులో సంచరిస్తున్న 20 ఆవులను కంపోస్టుయార్డు ఎదురుగా ఉన్న స్థలంలోకి తరలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య మేస్త్రీల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాటిని అక్కడికి తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్: మండల న్యాయసేవాధికార కమిటీలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి అర్హత ఉన్న వారు ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సుభాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆఫీస్ ఆఫ్ ది చైర్మన్ కమ్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, కళ్యాణదుర్గం వారికి బయోడేటాను స్వయంగా లేదా పోస్టుద్వారా పంపవచ్చని తెలిపారు.

నేడు తలారి రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం రూరల్: మాజీ ఎంపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఉదయం 9 గంటలకు సమన్వయకర్త తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నేత ఉమామహేశ్వరనాయుడు హాజరు కానున్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్, రిడ్స్ సంస్థ అధికారులు

కూడేరు: అవగాహనతో ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం జోనల్‌సూపర్ వైజర్ పెద్దన్న తెలిపారు. గురువారం కూడేరులోని కేజీబీవీ విద్యార్థినులకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ ఉమాదేవి, స్కీం లింక్ వర్కర్ రాజేశ్వరి, టీచర్లు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణపై జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రజలను చైతన్య పరిచారు. గురువారం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి చాంద్‌బేగం, రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు నాగరాజు, వీరయ్య రిడ్స్ సంస్థ సిబ్బంది వరలక్ష్మీ, భాగ్యమ్మ, నాగలక్ష్మీ, శశికళ, కవిత, దివ్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య





మాట్లాడుతున్న సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, హాజరైన నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమన్వయకర్త అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమన్వయకర్తతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమ మహేశ్వర నాయుడు మాట్లాడారు. అబద్ధాలతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ఎగ్గొట్టేసిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేయకుండా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడానికే సమయం కేటాయిస్తోందన్నారు. రాష్ట్రంలో గతంలో పనిచేసిన ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, వైఎస్సార్ కంటే సమర్థవంతంగా వైఎస్ జగన్ పాలన అందించారన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీ మేరకు ప్రతి పథకాన్ని పేద ప్రజలకు అందించారని గుర్తు చేశారు. అధికారం లేదన్న బాధను మర్చిపోవాలన్నారు.

కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం..

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని రంగయ్య అన్నారు. పోరాటాలు మనకు కొత్తేమీ కాదని, ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాలకు తరలి రావాలన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, జెడ్పీటీసీలు బొమ్మన్న, మంజునాథ్, రాధాస్వామి, గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, భీమేష్, ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు గోపారం శ్రీనివాసులు, సర్వోత్తమ, బసవరాజు, సత్యనారాయణ శాస్త్రి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, నాయకులు నారాయణపురం వెంకటేశులు, ములకనూరు తిమ్మరాయుడు, కోనాపురం గంగాధర, దొణస్వామి, తిరుమల వెంకటేశులు, ఎంఎస్ రాయుడు, పాలాక్షి, గోళ్ల సూరి, రేవన్న, పరంధామరెడ్డి, మల్లికార్జున, సోమశేఖర్‌రెడ్డి, నీలిశంకరప్ప, దొడగట్ట నారాయణ, తలారి సత్తి, కొల్లప్ప, బిక్కిహరి, దీపు, మహిళా నాయకులు చందన శివాజీ, ప్రియాంక, నాగలక్ష్మి, ఐదు మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా అంకిత భావంతో పనిచేయాలి

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త అంకిత భావంతో పని చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గ స్థాయి అధ్యక్షులు ఎంపిక జరిగింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నియోజకవర్గ స్థాయి 29 అనుబంధ విభాగాల అధ్యక్షులను సమన్వయకర్తతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడుల సమక్షంలో ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్టీ విభాగం నగేష్ నాయక్ (పీటీఆర్ పల్లి తండా), పంచాయతీ విభాగంబుటారి సుధాకర్ (ముద్దినాయనపల్లి), ప్రచార విభాగం గొల్ల చిత్తప్ప (మల్లికార్జున పల్లి), ఎంప్లాయీస్ విభాగం కురబ సన్నప్ప (మల్లాపురం), సాంస్కృతిక విభాగం జైపాల్ రెడ్డి (దాసంపల్లి), ఎస్సీ విభాగం ఎన్. తిప్పేస్వామి (జంబుగుంపల), చేనేత విభాగం ఆర్. శ్రీనివాసులు (తెనగల్లు), ఐటీ విభాగం సి. మల్లిస్వామి (అపిలేపల్లి), ఇంటలెక్చువల్ విభాగం ఎస్. బాబు (బెస్తరపల్లి), రైతు విభాగం పి. అభిలాష్ రెడ్డి (బొమ్మగానిపల్లి), క్రిస్టియన్ విభాగం హెచ్.దేవపుత్ర (బ్రహ్మసముద్రం), కార్మిక విభాగం టి. సంజీవ (చెలిమేపల్లి), వాణిజ్య విభాగం కె.పాతలింగప్ప (నూగేపల్లి), బీసీ విభాగం విజయ్ (ముచ్చర్లపల్లి), గ్రీవెన్స్ విభాగం గిరి వే ముల (చిన్నంపల్లి), సోషల్ మీడియా విభాగంప్రదీప్ (చింతర్లపల్లి), వైఎస్సార్ ట్రేడ్ విభాగం ఖాసీంసాబ్ (చెర్లోపల్లి), ఆర్‌టీఐ విభాగం బి.కిరణ్ (కంబదూరు), వికలాంగుల విభాగం పాతలింగప్ప (ఐపార్శపల్లి), మైనార్టీ విభాగం చికెన్ దాదా (కంబదూరు)ను ఎంపిక చేశారు.

అనుబంధ విభాగాల అధ్యక్షులకు శుభాకాంక్షలు



అనుబంధ విభాగాల అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శెట్టూరు: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు మాజీ ఎంపీ తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శ బోయ తిప్పేస్వామి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. శెట్టూరు మండలం నుంచి బీసీ విభాగానికి ముచ్చర్లపల్లి విజయ్‌కుమార్, ట్రేడ్ యూనియన్ విభాగానికి చెర్లోపల్లి ఖాసీం సాబ్, గ్రీవెన్స్ విభాగానికి చిన్నంపల్లి వే ముల గిరిబాబు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చింతర్లపల్లి ప్రదీప్ ఎంపికైనట్లు జెడ్పీటీసీ మంజు నాథ తెలిపారు. సర్పంచ్‌లు విరుపాక్షి, ఈరన్న, గంగాధర్, నాగ రాజు, గంగన్న, నాయకులు ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, వీరాంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, రామాంజనేయులు, పాలయ్య, టైలర్ వన్నూరు స్వామి, బాబురావు, గౌరయ్య, ప్రతాప్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

రాయదుర్గంటౌన్: ఈ నెల 6 నుంచి 23 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. 6న మల్లాపురం, 7న బొందనకల్లు, 10న వేపరాళ్ల, 11న జుంజురాంపల్లి, 12న కొంతానపల్లి, 13న గ్రామదట్ల, 17న డి.కొండాపురం, 18న అవులదట్ల, నాగిరెడ్డిపల్లి, 19న బీఎన్ హళ్లి, 20 న 74 ఉడేగోళం, 21న చదం, మెచ్చిరి, 23న రాయదుర్గంలో జరుగుతాయన్నారు.

బొమ్మనహాళ్: 6న నేమకల్లు గ్రామ సచివాలయంలో, 7న కురువల్లి గ్రామ సచివాలయంలో, 9న సిద్ధరాంపురం దేవమ్మ కట్ట వద్ద, 10న బొమ్మనహాళ్ గ్రామ సచివాలయం, 11న ఉంతకల్లు గ్రామ సచివలయం, 12న ఉద్దేహాళ్ గ్రామ సచివాలయం , 13న హరేసముద్రం పిర్లచావిడి దగ్గర, 16న బండూరు రచ్చకట్ట వద్ద, 17న కల్లుదేవనహళ్లి గ్రామ సచివాలయం, 18న బొల్లనగుడ్డం గ్రామ సచివాలయం, 19న గోవిందవాడ గ్రామ సచివాలయం, 20న దర్గాహొన్నూరు గ్రామ సచివాలయం, 21న శ్రీధరఘట్ట గ్రామ సచివాలయం, 23న సింగానహళ్లి విలేజ్ పంచాయతీ కార్యాలయం, 24న కొలగానహళ్లి దేవమ్మ కట్ట దగ్గర, 26న ఏలంజిలో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు.

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా ఉన్న 13 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆర్ సుమతి తెలిపారు.

కణేకల్లు: మండలంలో ఈనెల 6 నుంచి జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. 6న 43 ఉడేగోళం గ్రామంలో 10న బ్రహ్మసముద్రంలో, 11న బెణికల్లులో, 12న బిదరకుంతంలో, 13న మీన్లహళ్లిలో, 17న తుంబిగనూరులో, 18న గరుడచేడులో, 19న గెనిగెరలో, 20న ఎన్.హనుమాపురంలో, 21న సొల్లాపురంలో, 24న మాల్యంలో 26న కళేకుర్తిలో, 27న హనకనహాళ్‌లో, 28న రచ్చుమర్రిలో 31న హులికేరలో జనవరి 2న యర్రగుంటలో, 3న కణేకల్లులో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కంబదూరు: 6న నూతిమడుగు,7న ములకనూరు,10న తిమ్మాపురం, 12న కర్తనపర్తి,13న పాళ్లూరు,17న కురాకులపల్లి, 19న రాళ్ల అనంతపురం, 21న రాళ్లపల్లి, 24న గూళ్యం, 26న రాంపురం, 27న చెన్నంపల్లి, 28న కంబదూరులో సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాలకిషన్ గురువారం తెలిపారు. **గుమ్మఘట్ట:** ఈనెల 6న బేలోడు,7న భూపసముద్రం,10న కలుగోడు,11న గొల్లపల్లి,12న 75 వీరాపురం, 13న తాళ్లకెర, 17న గుమ్మఘట్ట 18న ఎస్.హొసల్లి, 19న పూలకుంట, 20న రంగసముద్రం, 21న గలగల గ్రామాల్లో సదస్సులు ఉంటాయని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

సాగు భూములు ఏపీఐఐసీకి కట్టబెట్టడం తగదు



తహసీల్దార్‌ను నిలదీస్తున్న సీపీఎం నేతలు, రైతులు

కూడేరు: కొన్నేళ్లుగా సాగు చేస్తున్న భూములను అహుడా, ఏపీఐఐసీకి కేటాయించడం దారుణమని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం కూడేరులోని సర్వే నంబర్ 535లోని భూమిలోకి వెళ్లి తహసీల్దార్ మహబూబ్ బాషా, రెవెన్యూ సిబ్బంది కొలతలు వేస్తుండగా అరవకూరు, కూడేరు, కడదరకుంటకు చెందిన రైతులు అడ్డుకున్నారు. వీరికి మద్దతుగా సీపీఎం నాయకులు నిలిచారు. సీపీఎం నేతలు క్రిష్ణమూర్తి,కరీం సాబ్, మల్లికార్జున, వీరప్ప, అలివేలమ్మ, చిన్నా పాల్గొన్నారు.